సాక్షి నంద్యాల
ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



అన్నదానానికి రూ.లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి అద్దంకికి చెందిన ఎ.శేషసాయి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు హిమబిందుకు అందించారు.



అలరించిన నృత్యప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళా వేదికపై శనివారం హన్మకొండకు చెందిన నృత్యస్రవంతి కూచిపూడి కళా నిలయం బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం భక్తులను అలరించింది.



క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆడుదాం ఆంధ్ర జిల్లా స్థాయి పోటీలు ముగియడంతో శనివారం బహుమతులు అందజేశారు. 8లో▸

న్యూస్‌రీల్

మద్దిలేటయ్య ఒక్క రోజు ఆదాయం రూ.2.55 లక్షలు



ప్రత్యేక పుష్పాలంకరణలో మద్దిలేటి నరసింహస్వామి

బేతంచెర్ల: ఆర్‌ఎస్ రంగాపురం శివార్లలో వెలసిన వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి శనివారం ఒక్క రోజు రూ.2.55 లక్షల ఆదాయం సమకూరింది. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి అమ్మవార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన, వర పూజ, ఆకుపూజ తదితర పూజలు చేపట్టారు. వివిధ సేవల ద్వారా శనివారం ఒక్క రోజు రూ. 2,55,901 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్ రామచంద్రుడు తెలిపారు.

97.6 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో ఫిబ్రవరి నెల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతుంది. శనివారం కూడా తెల్లవారుజాము నుంచే వలంటీర్లు, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈనెల 5వ తేదీ వరకు పింఛన్ పంపిణీ జరుగుతుందని డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. జిల్లాలో 2,24,398 మంది లబ్ధిదారులు ఉండగా ఇప్పటి వరకు 2,17,809 మందికి (97.6 శాతం) పంపిణీ చేసినట్లు తెలిపారు. వృద్ధాప్య, వికలాంగులు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్లు పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించిందన్నారు.

7న మిషన్ వాత్సల్య పరీక్ష

నంద్యాల(అర్బన్): బాలల సంరక్షణ విభాగం (మిషన్ వాత్సల్య) పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 7వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సాధికారిత అధికారిణి నిర్మల శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకొని కంప్యూటర్ పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థుల వివరాలను జిల్లా వెబ్‌సైట్‌లో ఉంచామన్నారు. ఆయా, చౌకీదర్ అభ్యర్థులు మినహా కంప్యూటర్ పరీక్షకు అర్హత సాధించిన అభ్యర్థులందరూ హాజరు కావచ్చని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన్‌స్టాప్ సెంటర్ (సఖీ) అత్యవసర సేవలలో నున్న ఉద్యోగాలకు కాంట్రాక్ట్ పద్ధతిన జిల్లాలోని అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, అభ్యర్థినులకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల వయస్సు సడలింపు ఉంటుందని, అత్యాచారానికి గురైన మహిళలకు 50శాతం రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 5 నుంచి 12వ తేదీ లోపు బీఎస్ఎన్ఎల్ క్వార్టర్స్‌లోనున్న స్త్రీశిశు అభివృద్ధి మహిళా సాధికారత కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వివరాలకు http:// nandyal.ap.gov.in//లో పరిశీలించాలని కోరారు.

16న వైఎస్సార్ చేయూత నిధుల విడుదల

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్సార్ చేయూత కింద 45 నుంచి 60 ఏళ్లలోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు 4వ ఏడాది నిధుల విడుదలకు రంగం సిద్ధమైంది. 2021-22 నుంచి 2022-23 వరకు మూడేళ్లలో మహిళలకు రూ.666.50 కోట్ల ప్రయోజనం కలిగింది. 2023-24వ సంవత్సరానికి సంబంధించి వైఎస్సార్ చేయూత నిధులు ఈ నెల 16న నేరుగా మహిళల బ్యాంకు ఖాతాలకు విడుదల చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. 4వ ఏడాది జిల్లాలో దాదాపు 1.50 లక్షల మంది మహిళలకు రూ.250 కోట్ల వరకు ప్రయోజనం లభిస్తుంది.

జెడ్పీ అంచనా బడ్జెట్ రూ.1,086 కోట్లు

- స్థాయీ సంఘ సమావేశాల్లో వివరాలు వెల్లడి
- నీటి వనరులను సద్వినియోగం చేసుకుందామన్న జెడ్పీ చైర్మన్
- వేసవిలో నీటిఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామన్న అధికారులు
- జెడ్పీ పాత భవనం ఏపీ టూరిజం డిపార్ట్‌మెంట్‌కు అద్దెకు ఇవ్వడంపై చర్చ
- గోరుకల్లు రిజర్వాయర్‌లో నీరు నిల్వ చేసిన ఇరిగేషన్ అధికారులకు ప్రశంసలు



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



సమావేశానికి హాజరైన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీ సభ్యులు

కర్నూలు(అర్బన్): వివిధ ప్రభుత్వ శాఖలను కలుపుకొని 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1,086.456 కోట్లతో జిల్లా పరిషత్ అంచనా బడ్జెట్‌ను రూపొందించారు. ఈ వివరాలను శనివారం జెడ్పీ మినీ సమావేశ భవనంలో నిర్వహించిన స్థాయీ సంఘ సమావేశాల్లో అధికారులు వెల్లడించారు. సమావేశాలకు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్లు దిల్షాద్ ముజాఫర్ నాయక్, కురువ బుజ్జమ్మ, చైర్‌పర్సన్ పీ దివ్య హాజరయ్యారు. అధికారులు 2022-23 అంచనా బడ్జెట్‌లో ఆదాయం రూ.924.743 కోట్లు కాగా, వ్యయాన్ని రూ.924.607 కోట్లుగా చూపించారు. ఇదే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్ అంచనా ఆదాయం రూ.941.515 కోట్లు కాగా, వ్యయం రూ.925.419 కోట్లుగా చూపించారు. అలాగే 2024-25 అంచనా బడ్జెట్‌కు సంబంధించి ఆదాయం రూ.1086.456 కోట్లు కాగా, వ్యయం 1068.582 కోట్లుగా చూపించారు. ఇందులో కేవలం జిల్లా పరిషత్‌కు సంబంధించి 2023-24 సవరించిన బడ్జెట్ అంచనా వ్యయం రూ.13.120 కోట్లు కాగా, వ్యయం రూ.13.005 కోట్లుగా చూపించారు. అలాగే 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్ ఆదాయం రూ.13.401 కోట్లు కాగా, వ్యయం రూ.13.284 కోట్లుగా చూపించారు. దీని పరిశీలిస్తే జిల్లా పరిషత్‌కు 2023-24 సవరించిన బడ్జెట్‌లో రూ.11.50 లక్షలు, 2024-25 అంచనా బడ్జెట్‌లో రూ.11.70 లక్షలు మిగులు కనిపిస్తోంది.

నీటి ఎద్దడి తలెత్తనీయొద్దు..

జిల్లాలో ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఏర్పడిన దృష్ట్యా ఉన్న నీటి వనరులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. 1, 7వ స్థాయీ సంఘ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రానున్న వేసవిలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎక్కడా తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆర్‌డబ్ల్యూఎస్ కర్నూలు ఎస్ఈ బీ నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కర్నూలు జిల్లాలో 169 జనవాసాల్లో నీటి ఎద్దడి తలెత్తే అవకాశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో పనుల కోసం రూ.14.98 కోట్లు అవసరమవుతాయని జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. అలాగే నంద్యాల జిల్లా నుంచి రూ.8 కోట్లతో ప్రతిపాదనలు పంపించారన్నారు. గత సమావేశాల్లో తీసుకున్న నిర్ణయం మేరకు గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి హంద్రీ నదికి నీటిని వదిలి కోడుమూరు, చుట్టుపక్కల గ్రామాల ప్రజల దాహార్తి తీర్చేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. 15వ ఆర్థిక సంఘం నిధులను మండల పరిషత్‌లకు విడుదల చేసిన నేపథ్యంలో బోర్లకు సంబంధించిన మెటీరియల్ కొనుగోలుపై ఎంపీడీఓలను సంప్రదించాలని జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి సూచించారు.

ప్యాచ్ వర్కులు చేపట్టండి

గార్గేయపురం నుంచి మిడుతూరు వరకు రోడ్డును బాగు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు యుగంధర్‌రెడ్డి కోరారు. రామళ్లకోట - వెల్దుర్తి రోడ్డు పనులు 15 రోజుల్లో పూర్తి కానున్నాయని, వెంటనే ఈ రోడ్డు పనులు చేపడతామని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ శ్రీధర్‌రెడ్డి చెప్పారు. కోడుమూరు - వెల్దుర్తి రోడ్డులో ఏర్పడ్డ గుంతలకు ప్యాచ్ వర్కులు చేపట్టాలని కోడుమూరు జెడ్పీటీసీ సభ్యుడు బీ రఘునాథరెడ్డి కోరారు. కొత్తపల్లి మండలం ఎర్రమఠం, గువ్వలకుంట్ల, ముసలిమడుగు గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యుడు ఎస్ సుధాకర్‌రెడ్డి కోరారు. సమావేశాలకు ఆర్‌అండ్‌బీ ఎస్ఈలు ఆర్ నాగరాజు, ఏవీ శ్రీధర్‌రెడ్డి, పీఆర్ ఎస్ఈ కే సుబ్రమణ్యం, ఈఈలు మద్దన్న, రామకృష్ణారెడ్డి, ఇరిగేషన్ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ, డీఎంఅండ్‌హెచ్ఓ డా.రామగిద్దయ్య, హౌసింగ్ పీడీ ఎం సిద్దలింగమూర్తి, జెడ్పీటీసీలు ఏరూరు శేఖర్, చల్లా శ్రీలక్ష్మి, బీ రఘునాథరెడ్డి, రంగనాథగౌడ్, సుధాకర్‌రెడ్డి, మౌలాలి, ప్రసన్నకుమార్, సుంకన్న, పవిత్రా పాటిల్, మురళీధర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, పులికొండ నాయక్, శివశంకర్‌రెడ్డి, రామక్రిష్ణ, కేవీఆర్ మహేశ్వరరెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఆదాయంపై దృష్టి

జెడ్పీకి ఆదాయ మార్గాలను అన్వేషించే ప్రక్రియలో భాగంగా పాత భవనాన్ని ఏపీ టూరిజం శాఖకు అద్దెకు ఇచ్చేందుకు స్థాయి సంఘ సమావేశాల్లో చర్చ జరిగింది. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్మాణ భవనాలను ఒక చదరపు అడుగు రూ.15, ఖాళీ స్థలం ఒక అడుగు రూ.10 మేర అద్దెకు ఇచ్చేందుకు సభ్యుల ఆమోదం కోరారు. అయితే మండలాల్లోనే ఒక చదరపు అడుగు రూ.30 వరకు ఉందని పలువురు జెడ్పీటీసీ సభ్యులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కర్నూలులో ఇటీవల ఏర్పాటు చేసిన లోకాయుక్త, హెచ్‌ఆర్‌సీ భవనాలకు ఒక చదరపు అడుగు రూ.30 మేర అద్దె నిర్ణయించారని ఆర్‌అండ్‌బీ నంద్యాల ఎస్ఈ ఏవీ శ్రీధర్‌రెడ్డి సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ధరను నిర్ణయిస్తామని జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి తెలిపారు. జెడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఆమోదంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుదామన్నారు.

రైతుల్లో ఆనందం

ఐఏబీ సమావేశంలో ముందు చూపుతో తీసుకున్న నిర్ణయంతో గోరుకల్లు రిజర్వాయర్‌లో 11 టీఎంసీల నీటిని నిల్వ చేశారని, ప్రస్తుతం రిజర్వాయర్‌లో 4 టీఎంసీల నీరు నిల్వ ఉందని జెడ్పీ చైర్మన్ అన్నారు. నీరు నిల్వ చేసుకోవడం వల్ల రిజర్వాయర్ కింద వేసిన పంటలకు నేటికీ నీరు అందిస్తున్నారన్నారు. ఇందుకు ఇరిగేషన్ అధికారులను అభినందిస్తున్నామన్నారు. డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లోని చెరువులను హంద్రీ-నీవా నీటితో నింపారన్నారు. నేటికి 62 చెరువుల్లో పుష్కలంగా నీరు ఉందన్నారు. ఈ చెరువుల్లో నీరు ఉన్నందున చుట్టుపక్కల బోర్లు రీచార్జ్ కావడంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సమక్షంలో 200 కుటుంబాలతో వైఎస్సార్‌సీపీలో చేరిన పాములపాడు మండల టీడీపీ నాయకుడు విజయ సింహారెడ్డి తదితరులు

- శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థ రెడ్డి
- 200 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక
- పాములపాడు మండలంలో టీడీపీ ఖాళీ


నందికొట్కూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పేదల జీవితాల్లో వెలుగులు నింపారని శాప్ రాష్ట్ర చైర్మన్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షులు బైరెడ్డి సిద్దార్థరెడ్డి అన్నారు. పట్టణంలోని మార్కెట్ యార్డులోని గెస్ట్ హౌస్‌లో పాములపాడు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు రామలింగేశ్వరరెడ్డి, జూటూరు మధు ఆధ్వర్యంలో మండల టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ విజయ సింహారెడ్డి, ఉప సర్పంచ్ జీవన్‌కుమార్‌రెడ్డి, నీటి సంఘం జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కోట్ల నాగేశ్వరరెడ్డి, వార్డు సభ్యులు ప్రతాప్, మహమ్మద్ గని, బీసీ సంఘం నాయకులు ఆర్‌ఎస్ఆర్ గోపాల్, చెలిమిల మాజీ సర్పంచులు రామిరెడ్డి, భూషణం, దేవదాయ చైర్మన్ రాము, పిచ్చిరెడ్డి, సత్యమయ్య, శ్రీను, మహేష్‌తో పాటు 200 కుటుంబాలు తెలుగుదేశం పార్టీని వీడి శనివారం బైరెడ్డి సిద్దారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి బైరెడ్డి సిద్ధార్థరెడ్డి వైఎస్సార్‌సీపీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మతాలు, పార్టీలకతీతంగా అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత జగనన్నదే అన్నారు. అర్హత ఉన్న ప్రతి పేదవానికి అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, విద్యా దీవెన్న, వసతి దీవెన్న, ఆరోగ్యశ్రీ, పింఛన్లు తదితర సంక్షేమ పథకాలు అందించి ఆదుకున్నారన్నారు. నియోజకవర్గంలో జగనన్న కాలనీలో 4,969 మంది అర్హులైన పేదలకు ఇంటి స్థలంతో పాటు పక్కా గృహాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటికీ 2,659 గృహాలు నిర్మాణాలు పూర్తయి గృహ ప్రవేశాలు జరిగాయని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగనన్న డ్వాక్రా సంఘాల ద్వారా మహిళల ఆర్థికాభ్యున్నతికి విశేషంగా కృషి చేస్తునట్లు స్పష్టం చేశారు. పాములపాడు మండలంలో వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు, కార్యకర్తలు చేరడంతో టీడీపీ ఖాళీ అయ్యిందని గుర్తు చేశారు. సామాన్యుల ఆరోగ్య భద్రత కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి సీఎం జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వైఎస్సార్‌సీపీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు సైనికులా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యులు శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు శివరామకృష్ణారెడ్డి, జబ్బార్, వెంకటేశ్వరరెడ్డి, ఉపేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆళ్లగడ్డకు అహోబిలేశుడు

- గోవింద నామస్మరణతో మార్మోగిన పుర వీధులు
- కొనసాగిన ప్రభుత్వ యంత్రాంగ స్వాగత సంప్రదాయం



పట్టణంలోకి ప్రవేశించిన అహోబిలేశుని పార్వేట పల్లకీ



పల్లకీకి స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉన్న డీఎస్పీ, సీఐలు, పోలీస్ అధికారులు

ఆళ్లగడ్డ: తన వివాహ మహోత్సవానికి భక్త జనులను ఆహ్వానించేందుకు కొండ దిగిన అహోబిలేశుడు ఊరూరా పర్యటిస్తూ శనివారం ఆళ్లగడ్డ పట్టణానికి చేరుకున్నారు. పార్వేట పల్లకీలో కొలువై ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి, శ్రీ ప్రహ్లాదవరదస్వాములకు పట్టణ ప్రజలు నీరాజనం పలికారు. పట్టణ సమీపంలోని పడకండ్లలో పూజలు ముగిసిన అనంతరం పార్వేట పల్లకీ ఆళ్లగడ్డ పొలిమేరలోని వక్కిలేరు బ్రిడ్జిపైకి రాగానే పట్టణ ప్రజలు గోవింద.. గోవింద నామస్మరణ చేస్తూ మంగళ వాయిద్యాల మధ్య ఘన స్వాగతం పలికారు. ఉత్సవమూర్తులు మొదట ప్రథమ తెలుపు (సర్కారు తెలుపు)పై కొలువుదీరగా శతాబ్దాల సాంప్రదాయం కొనసాగింది. ఆనవాయితీ ప్రకారం ఒక్కో ప్రభుత్వ శాఖ కార్యాలయం వద్దకు స్వామి దూతలు మంగళ వాయిద్యాలతో వెళ్లి ఆ కార్యాలయ అధికారి, సిబ్బందిని పల్లకీ దగ్గరకు ఊరేగింపుగా తోడ్కొని వచ్చి దర్శన భాగ్యం కల్పిండం బ్రిటీష్ కాలం నుంచి వస్తోంది. నేటికీ అదే ఆనవాయితీని అవలంభిస్తుండటం విశేషం. ఇందులో భాగంగా మొదట పురపాలక సంఘం (గ్రామ పంచాయతీ), తహసీల్దార్, ఉప ఖజానా, పోలీసు, కార్యాలయ అధికారులు, సిబ్బంది స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అహోబిలేశుని పార్వేట పల్లకీ పట్టణానికి చేరుకోవడంతో తిరునాల సందడి షురూ అయ్యింది. పట్టణ ప్రధాన వీధుల్లో వివిధ అంగళ్లు వెలిశాయి. చిన్న పిల్లలు, యువతీ యువకులు రంగుల రాట్నాలు, ఊయలల్లో తిరుగుతూ సందడి చేశారు. మహిళలు తమ ఇళ్లకు వచ్చిన ఆడపడుచులకు, స్నేహితులకు సంప్రదాయంగా గాజులు, కుంకుమను బహుమతిగా ఇస్తున్నారు. డీఎస్పీ వెంకట్రామయ్య పర్యవేక్షణలో పట్టణ పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. పార్వేట ఉత్సవం ముగిసే వరకు ముత్యాలపాడు - చాగలమర్రి, అహోబిలం, రుద్రవరం తదితర గ్రామాల వైపు వెళ్లనున్న ఆర్టీసీ బస్సులు, ఆటోలు బైపాస్ రోడ్డులో వెళ్లేలా ఏర్పాట్లు చేశారు.

విధులకు డుమ్మా కొడితే చర్యలు

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి వెంకట నాగ శ్రీనివాసరావు



ఎస్సీ బాలికల వసతి గృహంలో వసతులపై ఆరా తీస్తున్న జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు

నందికొట్కూరు: ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు విధులకు డుమ్మా కొడితే చట్ట పరమైన చర్యలు తప్పవని జిల్లా న్యాయ సేవా అధికారి, సీనియర్ సివిల్ జడ్జి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారరం సాయంత్రం సబ్ జైలు, ఎస్సీ, బీసీ సంక్షేమ హాస్టళ్లను జిల్లా న్యాయ సేవా అధికారి, సీనియర్ సివిల్ జడ్జి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ జైల్‌లో బాల నేరస్థులు ఉన్నారా అని సూపరింటెండెంట్ మల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తేవాలని ఖైదీలకు సూచించారు. బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో విద్యార్థులు ఒకరు కూడా లేకపోవడం, వార్డెన్ ఎల్లమ్మ అందుబాటులో లేకపోవడంతో జడ్జి మండిపడ్డారు. బాలికలు నాలుగు రోజుల క్రితమే సొంతూర్లకు వెళ్లారని కమాటి వెంకటమ్మ జడ్జికి వివరించారు. ఎస్సీ బాలికల కళాశాల వసతి గృహంలో స్టోర్ రూమ్‌కు లాక్ చేసి ఉండడంతో వార్డెన్ ఉమాదేవిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సబ్‌జైల్, సంక్షేమ హాస్టళ్లలో పరిశీలించిన అంశాలను నివేదికగా హైకోర్టుకు అందజేస్తామన్నారు. జడ్జి వెంట సబ్‌జైల్ పర్యవేక్షణ అధికారి అరుణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ట్రాక్టర్ బోల్తా పడి కార్మికుడి మృతి


మృతి చెందిన భాస్కర్‌రెడ్డి

కొలిమిగుండ్ల: ఇటిక్యాల సమీపంలోని ప్రధాన రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కనకాద్రిపల్లెకు చెందిన గుట్టేటి భాస్కర్‌రెడ్డి(60) శనివారం తోటి కూలీలతో కలిసి ఇటిక్యాల సమీపంలోని పాలీష్ ఫ్యాక్టరీలో పాలీష్ రాళ్లను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని కనకాద్రిపల్లెకు బయలు దేరారు. కోళ్లఫారం షెడ్లు దాటాక రోడ్డు పక్కన నిలిపిన బైక్‌ను తప్పించబోగా అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ పక్కన కూర్చున్న భాస్కర్‌రెడ్డిపై ట్రాక్టర్, పాలీష్ రాళ్లు పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ ట్రాలీపై కూర్చున్న మరో ఇద్దరు కార్మికులు ప్రమాదాన్ని పసిగట్టి కిందకు దూకడంతో స్వల్ప గాయాలతో బయట పడ్డారు. ప్రధాన రహదారిపై ప్రమాదం చోటు చేసుకోవడంతో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాక్టర్‌ను పక్కకు తొలగించి ట్రాఫిక్ నియంత్రించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పలుకూరులో నాపరాయి అక్రమ తవ్వకాలు


నాపరాయిని తవ్వకాలను పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

కర్నూలు (న్యూటౌన్): బనగానపల్లె మండలం పలుకూరు గ్రామం సర్వే నంబర్ 719లో నాపరాయి అక్రమ తవ్వకాలు జరిపారని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ శనివా రం విలేకరులకు తెలిపారు. మైనింగ్ అధికారులు సంబంధిత ప్రాంతాన్ని తనిఖీ చేసి, 3,400 క్యూబిక్ మీటర్ల నాపరాయిని అక్రమంగా తవ్వినట్లు నిర్ధారించారన్నారు. ఇందుకు సంబంధించి గడ్డం మధుసూదన్‌రెడ్డిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ ఏడీ బైరాగినాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరెడ్డి, మురహరి పాల్గొన్నట్లు చెప్పారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగ అవకాశాలు మెరుగు



విజేతలకు ట్రోఫీలు అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తదితరులు

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తే భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు మెరుగు పడతాయని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. శనివారం నంద్యాల పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో 'ఆడుదాం ఆంధ్ర' జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి, ఆర్‌డీఓ మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఆడుదాం ఆంధ్ర పోటీలను ఆయా శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. క్రీడల్లో నైపుణ్యం సాధించిన వారికి ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా కింద ఉద్యోగ అవకాశాలు కూడా కల్పిస్తుందన్నారు. విద్యార్థులు క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించాలన్నారు. అనంతరం విజేతలకు ట్రోఫీతో పాటు మెడల్స్, సర్టిఫికెట్లను జేసీ తదితరులు అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు, నంద్యాల స్కూల్‌గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ శివకుమార్, పీఈటీలు రవికుమార్, మేనేజర్లు, శిక్షకులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

క్రీడావిభాగం	ప్రథమ	ద్వితీయ	తృతీయ
క్రికెట్ పురుషులు	నంద్యాల	నందికొట్కూరు	శ్రీశైలం
క్రికెట్ బాలికలు	డోన్	ఆళ్లగడ్డ	-
వాలీబాల్ పురుషుల	బనగానపల్లె	శ్రీశైలం	ఆళ్లగడ్డ
వాలీబాల్ బాలికలు	నందికొట్కూరు	ఆళ్లగడ్డ	బనగానపల్లె
ఖో–ఖో పురుషులు	ఆళ్లగడ్డ	నందికొట్కూరు	బనగానపల్లె
ఖో–ఖో బాలికలు	ఆళ్లగడ్డ	డోన్	-
కబడ్డీ పురుషులు	డోన్	నందికొట్కూరు	నంద్యాల
కబడ్డీ బాలికలు	నంద్యాల	పాణ్యం	ఆళ్లగడ్డ
బ్యాడ్మింటన్ పురుషులు	నంద్యాల	నందికొట్కూరు	డోన్
బ్యాడ్మింటన్ బాలికలు	నంద్యాల	ఆళ్లగడ్డ	డోన్

తహసీల్దార్లకు స్థానాల కేటాయింపు

నంద్యాల(అర్బన్): రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు నంద్యాల జిల్లాలో పని చేస్తున్న 30 మంది తహసీల్దార్లను ఇతర జిల్లాలకు బదిలీ చేయగా అదే సమయంలో ఇతర జిల్లాలో పని చేస్తున్న తహసీల్దార్లను నంద్యాల జిల్లాకు కేటాయించారు. నంద్యాల జిల్లాకు సంబంధించిన తహసీల్దార్లను సంబంధిత మండలాలను కేటాయించారు. తహసీల్దార్ల కేటాయింపు వివరాలు ఇలా ఉన్నాయి.

మండలాల వారీగా తహసీల్దార్లకు స్థానాల కేటాయింపు ఇలా..

తహసీల్దార్ పేరు	గతంలో పని చేసిన స్థానం	కేటాయించిన స్థానం
చంద్రశేఖర్‌రెడ్డి	నగరి (చిత్తూరు)	నంద్యాల
సుమతి	యల్లనూరు (అనంతపురం)	బండిఆత్మకూరు
ప్రతాపరెడ్డి	గుంతకల్లు (అనంతపురం)	ప్యాపిలి
సునితబాయి	పామిడి (అనంతపురం)	కొలిమిగుండ్ల
నాగభూషణం	పెద్దవడుగూరు (అనంతపురం)	సంజామల
ఫణికుమార్	శెట్టూరు (అనంతపురం)	పాణ్యం
నాగరాజు	తాడిమర్రి (అనంతపురం)	దొర్నిపాడు
మురళీమోహన్	చిత్తూరు (అర్బన్)	రుద్రవరం
బాబురాజేంద్రప్రసాద్	గుడిపల (చిత్తూరు)	జూపాడుబంగ్లా
జయప్రకాష్	ఎస్‌ఆర్‌పురం (చిత్తూరు)	కోవెలకుంట్ల
బాబు	పాలసముద్రం (చిత్తూరు)	ఆత్మకూరు
భార్గవి	బీఎన్ కండ్రిగ (తిరుపతి)	గోస్పాడు
వెంకటేశ్వర్లు	రామచంద్రాపురం (తిరుపతి)	మిడుతూరు
వెంకటరమణ	కలెక్టరేట్ (వైఎస్సార్)	ఉయ్యలవాడ
రమణమ్మ	ఆర్‌డీఓ ఏఓ (వైఎస్సార్)	చాగలమర్రి
విజయకుమారి	ఆర్‌డీఓ ఏఓ (వైఎస్సార్)	వెలుగోడు
జీవన్‌చంద్రశేఖర్	కడప (అర్బన్)	బేతంచెర్ల
మధురవాణి	బి.కోడూరు (వైఎస్సార్)	శిరివెళ్ల
రవీంద్రారెడ్డి	కలశపాడు (వైఎస్సార్)	బనగానపల్లె
దామోదర్‌రెడ్డి	గోపవరం (వైఎస్సార్)	నందికొట్కూరు
నజీర్‌అహమ్మద్	ప్రొద్దుటూరు (వైఎస్సార్)	ఆళ్లగడ్డ
గురప్ప	జమ్మలమడుగు (వైఎస్సార్)	శ్రీశైలం
తిరుపతయ్య	మైలవరం (వైఎస్సార్)	కొత్తపల్లి
జ్యోతి రత్నకుమారి	పెద్దముడియం (వైఎస్సార్)	నంద్యాల కలెక్టరేట్
మాధవకృష్ణారెడ్డి	పులివెందుల (వైఎస్సార్)	డోన్

హాస్టల్ వార్డెన్ సస్పెన్షన్

నంద్యాల అర్బన్: పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ బాలుర కళాశాల వసతి గృహం వార్డెన్ వెంకటేశ్వర్లును సస్పెండ్ చేసినట్లు శనివారం రాత్రి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ చింతామణి తెలిపారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్య వైఖరి ప్రదర్శించడం, విధుల్లో అలసత్వం వంటి కారణాలతో సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రామలింగేశ్వర్ నగర్‌లో చోరీ

- 5 తులాల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు అపహరణ

కర్నూలు : నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామలింగేశ్వర్ నగర్‌లో శనివారం చోరీ జరిగింది. కాలనీలో నివసించే పుష్పలత అనే మహిళ గత నెల 25న బంధువులను చూసేందుకు హైదరాబాద్ వెళ్లింది. వారం రోజులుగా అక్కడే ఉంది. ఇంటికి తాళం వేసిన విషయాన్ని గుర్తించిన దొంగలు ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న 5 తులాల బంగారం, రూ.9 వేల నగదు, వెండి దొంగలించి ఉడాయించారు. చుట్టు పక్కల వారు గమనించి సమాచారం ఇవ్వడంతో ఆమె ఇంటికి చేరుకుంది. తాళం పగులగొట్టడంతో పాటు ఇంట్లో సామనన్ను చిందరవందరగా ఉండటంతో దొంగతనం జరిగినట్లు గుర్తించి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సమాజాభివృద్ధిలో మీడియా పాత్ర కీలకం


ఏపీడబ్ల్యూజేఎఫ్ డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు: సమాజాభివృద్ధిలో మీడియా పాత్ర కీలకమని ఏసీబీ డీఎస్పీ వెంకటాద్రి అన్నారు. స్థానిక ఎ.క్యాంప్‌లోని కర్నూలు హార్ట్ ఫౌండేషన్ భవనంలో ఏపీడబ్ల్యూజేఎఫ్ డైరీ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి డీఎస్పీ వెంకటాద్రితో పాటు హార్ట్ ఫౌండేషన్ అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్, గీతాంజలి నర్సింగ్ కళాశాల అధినేత పెరుగు విజయవర్ధన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు ప్రజలకు అండగా ఉండి వారి సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చేది జర్నలిస్టులేనన్నారు. కార్యక్రమంలో ఏపీ డబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, గోరంట్లప్ప, జిల్లా నాయకులు బసప్ప, ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు హుస్సేన్, నంద్యాల జిల్లా కన్వీనర్ మద్దయ్య యాదవ్, కర్నూలు జిల్లా కన్వీనర్ నాగేంద్ర, నగర అధ్యక్షుడు శివకుమార్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతి


కురువ సురేష్(ఫైల్)

కోడుమూరు రూరల్: విద్యుదాఘాతంతో గొర్రెల కాపరి మృతిచెందిన ఘటన శనివారం లద్దగిరిలో గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కురువ సురేష్ (33) తనకున్న గొర్రెలకు మేత కోసం గ్రామానికి సమీపంలో ఉన్న చెట్టుపైకెక్కి ఆకులు కోస్తున్నాడు. చెట్టు పక్కనే ఉన్న కరెంట్ తీగను చూడకుండా తాకడంతో షాక్‌కు గురై కిందపడిపోయాడు. సమీపంలోని వ్యక్తులు, కుటుంబ సభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించేందుకు యత్నించగా.. అప్పటికే సురేష్ మృతి చెందాడు. మృతుడికి భార్య కురువ మాధవితో పాటు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న కోడుమూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గవర్నర్‌ను కలసిన ఆర్‌యూ వీసీ


గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఆర్‌యూ వీసీ సుధీర్ ప్రేమ్‌కుమార్

కర్నూలు కల్చరల్: ఆంధ్రప్రదేశ్ గవర్నర్, వర్సిటీ చాన్సలర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్‌ను రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బి. సుధీర్ ప్రేమ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఆర్‌యూ వీసీగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన విజయవాడలోని రాజభవన్‌లో శనివారం గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తనకు వీసీగా అవకాశం కల్పించినందుకు గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


కృష్ణయ్య (ఫైల్)

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల–బనగానపల్లె ఆర్‌అండ్‌బీ రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ వరప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన మంగలి కృష్ణయ్య అలియాస్ కిట్టు (34) కొలిమిగుండ్ల మండలం కనకాద్రిపల్లెకు చెందిన శివలక్ష్మి అనే మహిళను 15 సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇదే మండలంలోని ఇటిక్యాల సమీపంలో నాపరాతి గనిలో కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. వీరికి ఏడవ తరగతి చదువుతున్న రాంచరణ్ సంతానం. కోవెలకుంట్లలో ఉన్న బంధువుల ఇంటికి కుటుంబ సమేతంగా వచ్చాడు. షేవింగ్ చేయించుకునేందుకు బైక్‌పై వెళుతుండగా పట్టణ శివారులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జలకళ బోర్ల తవ్వకాలు పారదర్శకమే

- 13 మండలాల్లో వైఎస్సార్ జలకళ బోర్లపై ముగిసిన సోషల్ ఆడిట్


సోషల్ ఓపెన్ ఫోరంలో రికార్డులు పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమరనాథరెడ్డి

కర్నూలు(అగ్రికల్చర్)/కల్లూరు: వైఎస్‌ఆర్ జలకళ బోర్ల తవ్వకం పూర్తి పారదర్శకంగా జరుగుతోందని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. శనివారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో జిల్లాలోని 13 మండలాల్లో 2022 జూలై 1 నుంచి ఇప్పటివరకు వేసిన జలకళ బోర్లపై సామాజిక తనిఖీల్లో భాగంగా ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక తనిఖీల ప్రతినిధులు సోషల్ ఆడిట్‌లో వెలుగు చూసిన అంశాలను ఓపెన్ ఫోరం దృష్టికి తీసుకొచ్చారు. 13 మండలాల్లో 545 బోర్లు వేశారని, ఇందులో 50 బోర్ల వరకు 5 శాతం వరకు తక్కువ లోతు ఉన్నాయన్నారు. అంటే 400 అడుగులు బోరు వేసినట్లు రికార్డు చేశారని, తమ పరిశీలనలో 20 అడుగుల లోతు తక్కువగా ఉన్నట్లు గుర్తించామని సోషల్ ప్రతినిధులు వివరించారు. దీనిపై సంబంధిత రైతులు స్పందిస్తూ అధికారులు బోర్లు నిర్దేత కొలతల ప్రకారమే వేశారని, అయితే 20 అడుగల వరకు పూడిపోయాయని వివరించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ సామాజిక తనిఖీల ద్వారా జలకళ బోర్లు తవ్వకాల్లో ఎలాంటి అక్రమాలు లేవని నిర్ధారించామన్నారు. చిన్న, సన్నకారు రైతులకు జలకళ బోర్లు ఎంతో ఉపయోగపడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వాటర్‌షెడ్ అడిషనల్ పీడీ మాధవీలత, డ్వామా విజిలెన్స్ అధికారి భాస్కర్, సామాజిక తనిఖీల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

నేరస్తులు చట్టం నుంచి తప్పించుకోకూడదు



మాట్లాడుతున్న డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జే సుదర్శన్‌రెడ్డి

బొమ్మలసత్రం: పలు నేరాల్లో నిందితులు చట్టం నుంచి తప్పించుకోకుండా పోలీసులు, పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సమన్వయంతో వ్యవహరించాలని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జే సుదర్శన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సూరజ్‌గ్రాండ్ హోటల్‌లో జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీస్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నేరాలు జరిగినప్పుడు సంఘటన స్థలంలో పూర్తి ఆధారాలు సేకరిస్తే నిందితులు తప్పించుకోలేరన్నారు. సరైన సాక్ష్యాధారాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు కోర్టులకు సమర్పించి నిందితులకు శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గత ఏడాది తప్పు చేసిన ఎంతో మంది నేరస్తులకు పోలీసులు, పీపీల సమన్వయంతో జైలు శిక్షలు పడేలా చేశారని అభినందించారు. అనంతరం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి చేతుల మీదుగా 2024 ప్రాసిక్యూషన్ డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ యెహెజ్కేల్, ఉమ్మడి జిల్లాల పీపీలు పాల్గొన్నారు.

ముగిసిన మహానంది ధర్మకర్తల మండలి గడువు

మహానంది: మహానంది దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల గడువు శుక్రవారంతో ముగిసింది. 2022 ఫిబ్రవరి 3వ తేదీన ప్రస్తుత ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. దీంతో ఫిబ్రవరి రెండవ తేదీకి రెండేళ్ల పూర్తి కావడంతో పదవీకాలం ముగిసింది. మార్చి నెలలో శివరాత్రి బ్రహ్మోత్సవాల సమీపిస్తున్న నేపథ్యంలో పాలకమండలి చైర్మన్, సభ్యుల ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశం చివరి సమావేశంగా మిగిలింది. తదుపరి దేవదాయ శాఖ నుంచి నోటిఫికేషన్ వచ్చే వరకు మహానంది ఆలయానికి ధర్మకర్తల మండలి ఉండదు. ఇదిలా ఉండగా ప్రస్తుతం ఉన్న చైర్మన్, సభ్యుల ఆధ్వర్యంలో ఉత్సవ కమిటీ పేరుతో ఉత్తర్వులు తెచ్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

ఈఓపీఆర్డీకి మెమో జారీ

జూపాడుబంగ్లా: విధులకు గైర్హాజరవుతున్న ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తికి ఎంపీడీఓ నూర్జహాన్ మెమో జారీ చేశారు. గతనెల 30వ తేదీ నుంచి ఈఓపీఆర్డీ ఎలాంటి సమాచారం ఇవ్వకుండా, సెలవులు పెట్టకుండా విధులకు గైర్హాజరవుతున్నారు. ఈ విషయమై సమాచారం తెలుసుకొనేందుకు ఈఓపీఆర్డీకి ఎంపీడీఓ ఫోన్‌చేయగా స్విచ్ఛాఫ్ వస్తుండటంతో విషయాన్ని జిల్లా పంచాయతీరాజ్‌శాఖ అధికారిణి మంజులవాణి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు డీపీఓ ఆదేశాల మేరకు ఈఓపీఈఆర్డీకి మెమో జారీచేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.